# బంగారు తెలంగాణ లీకులమయం

**తెలంగాణ ఉద్యోగ అభ్యర్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలు**

- ఉన్నత విచారణ సంస్థతో విచారణ చేపట్టాలి
- ముఖ్యమంత్రి కెసిఆర్, కేటీఆర్‌లు రాజీనామా చేయాలి
- కూతురుని కాపాడుకునేందుకు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును నాశనం
- టిపిసిసి జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ
- పాల్వంచ అంబేడ్కర్ సెంటర్ నందు ధర్నా... దిష్టిబొమ్మ దహనం




**శామ్, మార్చి19(కెరటం ప్రతినిధి)**

బంగారు తెలంగాణ లీకులమయంగా మారిందని, తెలంగాణ ఉద్యోగ అభ్యర్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలు ఆడుకుంటోందని, టిఎస్‌పిఎస్‌సీ లీకేజీ విషయంలో ఉన్నత విచారణ సంస్థతో విచారణ చేపట్టాలని, ముఖ్యమంత్రి కెసిఆర్, కేటీఆర్‌లు రాజీనామా చేయాలని, కూతురుని కాపాడుకునేందుకు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేస్తున్నారని టిపిసిసి జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ విమర్శించారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు టిఎస్‌పిఎస్‌సీలో ప్రశ్నా పత్రాల లీకేజీ కారణమైన అసమర్థ ముఖ్యమంత్రి కెసిఆర్, కేటీఆర్‌లు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ టిపిసిసి జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో పాల్వంచ అంబేడ్కర్ సెంటర్ నందు ధర్నాను నిర్వహించి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగ అభ్యర్థుల జీవితాలతో ఆటలాడిన కెసిఆర్, కేటీఆర్‌లు తక్షణమే రాజీనామా చేయాలని, ఒక వ్యక్తి తప్పు చేస్తే వ్యవస్థ తప్పు చేసినట్లా, నాకేం సంబంధం అని నిర్లక్ష్యంగా మాట్లాడిన కేటీఆర్ మరి నీకు ఎం సంబంధం లేనప్పుడు విద్యాశాఖ మంత్రితో మాట్లాడినచాల్సింది పోయి అన్ని నాకే తెలుసు అనే అహంభావంతో మీడియా ముందుకు ఎందుకు వచ్చావ్ అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడయట్ ప్రశ్న పత్రాల లీకేజీ, ఇంటర్మీడియట్ బోర్డు తప్పిదాల వలన చనిపోయిన విద్యార్థులు, సింగరేణి పరీక్షల్లో అవకతవకలు ఇవ్వన్నీ తమరి కనుసైగల్లో జరిగినవి నిజం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సాధన పేరు చెప్పి కెసిఆర్ అమాయకులను బలి తీసుకుంటే, భవిష్యత్ మీద ఎన్నో ఆశలు పెట్టుకొని ప్రభుత్వ కొలువు కోసం వేచి చూస్తున్న నిరుద్యోగల ఉసురు కేటీఆర్ తీస్తున్నడని, ఇంకా ఎంత మందిని బలి తీసుకుంటే మీ తండ్రి,కొడుకుల దాహం తీరుతుందన్నారు, కేటీఆర్ పిఏ హస్తం ఉందని వినిపిస్తున్న నేపథ్యంలో ఉన్నత విచారణ సంస్థతో విచారణ చేపట్టాలని అన్నారు. తప్పు జరగకుండా చూడల్సిన ప్రభుత్వం ఇప్పుడు పరీక్షలను రద్దు చేసి నిరుద్యోగుల ఆశలతో ఆడుకుంటుందని అన్నారు. ఒకరిద్దరి మీద నెపం నెట్టివేసి ప్రభుత్వంలో ఉన్న పెద్ద వారిని కాపాడేందుకు చూస్తున్నారు అన్నారు. పరిపాలన చాత కాక ఒక దద్దమ్మలా కెసిఆర్ వ్యవహరిస్తున్నారని, లిక్కర్ కుంభకోణంలో కూతురుని కాపాడుకునేందుకు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మండి పడ్డారు.



ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాయల శాంతయ్య, పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు బొమ్మిడి మల్లికార్జున్, ఐఎన్‌టీయూసీ జలీల్, పాల్వంచ పట్టణ ఓబీసీ అధ్యక్షుడు చారీ, పాల్వంచ మైనారిటీ పట్టణ అధ్యక్షులు చాంద్ పాషా, ఎస్టీ సెల్ ఆంతోటి పాల్, పైడిపల్లి మనోహర రావు, వీరయ్య చౌదరి, భద్ది కిషోర్, కొండం వెంకన్న గౌడ్, భూక్యా రాములు నాయక్ ,రాము నాయక్, చంద్రగిరి సత్యనారాయణ,నాయకులు శెట్టిపల్లి వెంకట్, వానపాకుల రాంబాబు,సోషల్ మీడియా కో – కో ఆర్డినేటర్ షఫీ, యమ్మణ భానుతేజ, మల్లం వెంకన్న,చాప రాములు,బాలు నాయక్,సేవలాల్, రావూఫ్ తదితరులు పాల్గొన్నారు.

## లంచం అడిగితే చెప్పుతో కొట్టమన్నారు అవినీతికి పాల్పడితే దేనితో కొట్టాలి..?

**సీఎం కెసిఆర్, కవిత, కేటీఆర్‌లపై నాగా సీతారాములు ఘాటు వ్యాఖ్యలు**



**శామ్, మార్చి19(కెరటం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్రంలో అధికారులు ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా చెప్పుతో కొట్టమని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు తన కూతురు కవిత లిక్కర్ స్కాంలో, అదేవిధంగా టీఎస్పీఎస్సీ ప్రశ్నా పత్రాల లీక్ కేసులో తమకు సంబంధం లేనట్టు తప్పించుకుంటున్న కేటీఆర్‌లను దేనితో కొడతారంటూ? టిపిసిసి సభ్యులు నాగా సీతారాములు ఘాటు వ్యాఖ్యలతో ప్రశ్నించారు. ఆదివారం నాగా సీతారాములు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే చెప్పుతో కొట్టమన్న ముఖ్యమంత్రి ఇప్పుడు తన కుటుంబ సభ్యులు తప్పు చేస్తుంటే దేనితో కొడతారు? అంటూ ప్రశ్నించారు. ప్రజలకు, అధికారులకు, తన కుటుంబ సభ్యులకు ఒక్కో న్యాయం ఉండకూడదని అందరికీ సమానంగా చూడాలని ఆయన అన్నారు. అడ్డంగా దొరికిన కవితను వెనకేసుకు వచ్చేందుకు తండ్రి కెసిఆర్, మంత్రి కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ కుటుంబ సభ్యులు నరక యాతన పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రులకు సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు.



## దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే వనమా

**శామ్, మార్చి19(కెరటం ప్రతినిధి)**

రామవరంలోని జాతీయ బీసీ సంఘం జిల్లాగౌరవ అధ్యక్షులు పితాని సత్యనారాయణ తల్లి సత్యవతి దశదిన కర్మలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతామాలక్ష్మి, బీసీ సంఘం నాయకులు కాపు కృష్ణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రసూల్, జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదమూరు సత్యనారాయణ, జాతీయ బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, చంద్రుగొండ మండలం బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు భూపతి శ్రీనివాసరావు, జాతీయ బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రాజు గౌడ్, అన్నపురెడ్డిపల్లి జాతీయ బీసీ సంఘం మండల అధ్యక్షులు ఆకుల శివ, చంద్రుగొండ మండల జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆళ్లకుంట రాందాస్, జూలూరుపాడు మండల జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు గుమ్మడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# లీకేజీపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- టీఎస్ పీఎస్సీ చైర్మన్‌ను బాధ్యతల నుండి తొలగించాలి
- కేటీఆర్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలి
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్



**శామ్, మార్చి19(కెరటం ప్రతినిధి)**

ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో టీఎస్ పిఎస్సీ చైర్మన్ తో పాటు కమిటీ సభ్యులను తొలగించి కేసును సీబీఐకి లేదా సిట్టింగ్ జడ్జ్ తో విచారణ జరిపించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండల పరిధిలోని పెనుబల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.లీకేజీ విషయంలో సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని,రాజకీయ నేతలను పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్లుగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. పేపర్ లీకేజీకి సంభంధించి విచారణ జరుగుతుండగా కేటీఆర్ ఈ కేసులో దోషులు ఇద్దరే అని ఎట్లా తేల్చారు. విచారణ అధికారులను ప్రభావితం చేసేందుకే కేటీఆర్ ఇలా అంటున్నారని ఆరోపించారు ఆయన్ను వెంటనే మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.పేపర్ల లీకేజీలో కేసీఆర్ కుటుంబ సభ్యుల హస్తం ఉందన్నారు.సిట్ సీఎం కనుసన్నల్లో నడుస్తున్నదని నిందితులను ప్రభుత్వ పెద్దలు కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అంతకు ముందు జిల్లా గ్రంధాలయంలో పోటీ పరీక్షలకు సిద్దమవుతున్న యువతి,యువకులను కలిసి లీకేజీ వ్యవహారం వల్ల మనస్తాపం చెందకుండా ధైర్యంగా ఉండాలని, 30 లక్షల మంది నిరుద్యోగులకు తమ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఉత్తరప్రదేశ్ సీఎంగా ఉన్న సమయంలో 12 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారని,ఒక్కసారి కూడా పేపర్లు లీక్ కాలేదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జెబ్బా కృష్ణ, సురేష్, చెర్రీ, సందీప్, కనకయ్య,వంశీ తదితరులు పాల్గొన్నారు.

